ఆంధ్రజ్యోతి | హైదరాబాద్ ● బుధవారం 30 జూలై 2025

# కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ వర్సిటీలో ఆగస్టు నుంచి తరగతులు!

**'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ**

**పీజీ కోర్సులూ ఈ ఏడాది నుంచే ప్రారంభం**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటి ఎర్త్ సైన్సెస్ (భూ విజ్ఞాన శాస్త్రం) యూనివర్సిటీని రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఏర్పాటు చేసింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అంతకుముందున్న మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ వర్సిటీగా అప్‌గ్రేడ్ చేసి.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ పేరు పెట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ఇచ్చేందుకు 'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారు. బీఎస్సీలో జియాలజీ, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులతో పాటు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు కూడా ఈ ఏడాది నుంచే ప్రారంభించనున్నారు. ఒక్కో విభాగంలో బీఎస్సీలో 60, పీజీలో 40సీట్లు ఉన్నాయి. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా పీజీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. ప్రస్తుతం ఎర్త్ సైన్సెస్ కోర్సులన్నీ దేశంలో ఎక్కడా ఒకే వర్సిటీలో ఎక్కడా లేవు. ఈ కోర్సులకు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఎర్త్ సైన్సెస్ వర్సిటీ 312 ఎకరాల్లో ఏర్పాటవుతోంది. రూ.500 కోట్లతో సదుపాయాలు కల్పిస్తున్నారు. మొదటి ఏడాది ఏ కోర్సుల్లో ఏ సబ్జెక్టులు ఉండాలనే అంశంపై వివిధ వర్సిటీల అధ్యాపకులతో చర్చించారు. ఆగస్టులో తరగతులు ప్రారంభమవుతాయని విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వైస్ చాన్సలర్ యోగితా రాణా తెలిపారు. బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ ఫీజు రూ.19,500 వరకు ఉంటుందని, స్కాలర్‌షిప్ లభిస్తుందని ప్రిన్సిపాల్ జగన్ మన్మోహన్‌రాజు చెప్పారు.



ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

# 'ఫీజుల' రగడ

- **పరిమితిని పెంచాలంటూ యాజమాన్యాల వినతి**
- **పెంచొద్దంటూ విద్యార్థి సంఘాల డిమాండ్**
- **జేఎన్‌టీయూలో అధికారుల కమిటీ సమావేశం**

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ట్యూషన్ ఫీజుల పరిమితిని పెంచాలంటూ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల విజ్ఞప్తులు ఒకవైపు, యాజమాన్యాలు అడిగినంతగా పెంచవద్దంటూ విద్యార్థి సంఘాల డిమాండ్లు మరొక వైపు.. వెరసి జేఎన్‌టీయూలో బుధవారం రగడ చోటు చేసుకుంది. ఫీజుల పరిమితిపై ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ మంగళవారం తొలిసారి భేటీ అయింది. సమావేశానికి కమిటీ సభ్యులతో పాటు ప్రభుత్వ ప్రతినిధులు, ఇతర రాష్ట్రాలకు చెందిన అధికారులు హాజరై ఫీజుల ఖరారు అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఫీజులతో కాలేజీల్లో ఉన్నత ప్రమాణాలు పాటించేందుకు సాధ్యం కావడం లేదని, టీఎఫ్ఆర్‌సీకి తామిచ్చిన ప్రతిపాదనల మేరకు ఫీజులు పెరగకుంటే మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని కాలేజీల ప్రతినిధులు తెలిపారు.

## ఫీజులు పెంచొద్దు

ఇంజనీరింగ్ కాలేజీల్లో ట్యూషన్ ఫీజులను పెంచవద్దని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొందరు

మిగతా 6వ పేజీలో..

# 'ఫీజుల' రగడ

(5వ పేజీ తరువాయి)

విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. ఫీజులను అడ్డగోలుగా పెంచుకునేందుకు టీఏఎఫ్ఆర్‌సీకి నకిలీ నివేదికలను సమర్పించిన ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దశాబ్దం క్రితం నిర్ణయించిన మేరకు ప్రభుత్వం ఇస్తున్న ఫీజు రియంబర్స్‌మెంట్ రూ.35వేలను 70 వేలకు పెంచాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జవ్వాజి దిలీప్, రాహుల్, దుర్గాప్రసాద్, ధనుంజయ్, తనుజ్, ఆనంద్ నితిన్, చందు, అశ్విన్, దీపక్ జయరాం తదితరులున్నారు.

## విధివిధానాలపై అధ్యయనం

ఫీజుల పరిమితిపై అన్ని వర్గాల నుంచి సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నట్లు బాలకిష్టారెడ్డి తెలిపారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో అవలంబిస్తున్న ఫీజుల విధానాలను కూడా అధ్యయనం చేస్తున్నామన్నారు. త్వరలోనే మరోమారు కమిటీ సమావేశమై నివేదికను రూపొం ...భుత్వానికి అందజేయనుందని చెప్పారు.

# ఇంజనీరింగ్ రెండో విడత

- **కౌన్సెలింగ్‌లో 23509 మందికి సీట్లు**
- **ప్రైవేటులో 92%, యూనివర్సిటీల్లో 80% సీట్ల భర్తీ**
- **ఆగస్టు 8 నుంచి చివరి విడత కౌన్సెలింగ్**

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ సీట్లను సాంకేతిక విద్యాశాఖ మంగళవారం ప్రకటించింది. రెండో విడతలో మొత్తం 23509 మందికి సీట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటాలో మొత్తం 91495 సీట్లు ఉండగా.. మొదటి, రెండో విడతలో మొత్తం 83521 (91.2%) సీట్లు భర్తీ అయ్యాయని, 7974 సీట్లు మిగిలాయని ఎప్‌సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 6445 మంది ఈడబ్ల్యూఎస్ కోటాలో సీట్లు పొందారు. రెండో విడతలో 6377 మంది ఆప్షన్లు ఇచ్చినా సీటు దక్కలేదు. మొత్తం 72 ప్రైవేటు కాలేజీలు, 5 వర్సిటీల్లో 100శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రెండు ప్రైవేటు యునివర్సిటీల్లో 1386 సీట్లలో 1380 (99.5%) సీట్లు భర్తీ అయ్యాయి. అలాగే 155 ప్రైవేటు కాలేజీల్లో 83713 సీట్లలో 77158 (92.1%), 20 యునివర్సిటీ కాలేజీల్లో 6198 సీట్లలో 4942 (79.7%), ఒక ప్రభుత్వ కాలేజీలో 198 సీట్లలో 41 (20.7%) సీట్లు భర్తీ అయ్యాయి. సీటు పొందినవారు ఆగస్టు-1లోపు ట్యూషన్ ఫీజు చెల్లించి, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి, లేదంటే సీటు రద్దవుతుంది. రెండో విడతలో సీటు సాధించినా చేరని విద్యార్థులు చివరి విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనలేరు. రెండో విడతలో భర్తీ తర్వాత సీఎస్ఈలో 95.42%, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ 84.96%, సివిల్, మెకానికల్‌లో 74%, ఇతర విభాగాల్లో 73% సీట్లు భర్తీ అయ్యాయి. ఆగసు 8 ... విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

వార్త, హైదరాబాద్, బుధవారం 30, జూలై 2025

## ఇంజినీరింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో

# ఫీజుల నిర్ధారణ అధికారుల కమిటీ భేటీ

### 15 శాతం ఫీజులను పెంచాలని కోరిన ప్రిన్సిపాళ్లు

### తదుపరి సమావేశాల తరువాత ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్న కమిటీ

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు ఇతర ప్రొఫెషనల్ కాలేజీల్లో ట్యూషన్ ఫీజులను నిర్ణయించడానికి ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ మంగళవారం సమావేశం అయింది. జెఎన్‌టియు హైదరాబాద్ క్యాంపస్‌లో కమిటీ ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమైంది. సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపాల్స్ నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతోపాటు బోధనా సిబ్బందికి ఇంక్రిమెంట్స్ ఇవ్వాల్సి ఉంటుందని అందుకే కనీసం 15 శాతం ఫీజులను తప్పకుండా పెంచాలనే ప్రతిపాదనను ప్రిన్సిపాల్స్ ఫీజుల కమిటీ ముందుంచినట్టు తెలిసింది. ప్రిన్సిపాల్స్ చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకున్న కమిటీ.. మరోసారి కాలేజీ యాజమాన్యాలతో కూడా సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాలేజీ యాజమాన్యాలు చెప్పే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కమిటీ భావిస్తోంది.

అనంతరం కమిటీ తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించ నున్నట్టు తెలుస్తోంది. మరో రెండు, మూడు సార్లు సమావేశాలు నిర్వహించిన అనంతరం ప్రతిపాదనలను సిద్ధం చేయనున్నట్టు తెలుస్తోంది. 2025-28 బ్లాక్ పిరియడ్‌కి సంబంధించి ప్రైవేటు ఇంజనీరింగ్‌తోపాటు ఎంబిఏ, ఎంసిఏ, బిఈడి, ఎంఈడి, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ తదితర వృత్తివిద్య కోర్సులను అందిస్తున్న కాలేజీల్లో ట్యూషన్ ఫీజును నిర్ధారణ చేయడం కోసం ప్రభుత్వం అధికారుల కమిటీని నియమించిన విషయం తెలిసిందే. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ జివో ఎంఎస్ నంబర్ 29ని ప్రభుత్వం జారీ చేసిన విషయంతెలిసిందే. తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టిఏఎఫ్ఆర్‌సి) 2025-28 బ్లాక్ పీరియడ్ కోసం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ కాలేజీలు ఏఎఫ్ఆర్‌సికి సమర్పించిన ఫీజు ప్రతిపాదనలు.. సంబంధిత సుప్రీంకోర్టు, హైకోర్టుల పారామీటర్స్, నిబంధనలు, షరతులకు భిన్నంగా ఉన్నాయని ఈ నేపథ్యంలో ప్రైవేటు కాలేజీల్లో ఫీజు నిర్ధారణ కోసం పారామీటర్లను పరిశీలించి ప్రతిపాదనలు, సూచనలను చేయడానికి కమిటీని వేయాలని కోరగా ప్రభుత్వం 10 మందితో కమిటీని ఏర్పాటు చేసింది. అధికారుల కమిటీ మంగళవారం ప్రిన్సిపాల్స్‌తో సమావేశమైంది.

మన తెలంగాణ
బుధవారం 30, జులై 2025

# కొత్త ఫీజుల ఖరారు కోసం కసరత్తు షురూ

## ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో బాలకిష్టారెడ్డి కమిటీ భేటీ

మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా ఇతర వృత్తివిద్యా కళాశాలలకు ఫీజుల ఖరారు కోసం కొత్త విధివిధానాల రూపకల్పనకు ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ తొలి సమావేశం మంగళవారం కూకట్‌పల్లిలోని జెఎన్‌టియుహెచ్‌లో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు కే.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, తమిళనాడుకు చెందిన ఉన్నత విద్యామండలి ప్రతినిధులతో పాటు పలు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా కాలేజీల్లో విద్యా ప్రమాణాలు, వసతులతో పాటు సమస్యలపై యాజమాన్యాలతో చర్చించారు. రాష్ట్రంలో మూడేళ్లకోసారి ఇంజినీరింగ్, ఇతర వృత్తివిద్యా కోర్సుల ఫీజులను సవరించాల్సి ఉండగా, కొన్ని కాలేజీల ఫీజులు గతంలో కూడా సవరించలేదని, దాంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు యాజమాన్యాలు కమిటీ ముందు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలలో ఫీజులపై నియంత్రణ లేకపోవడంవల్ల ఆ యూనివర్సిటీలు తమకు నచ్చినట్లుగా ఫీజులు పెంచుకుని వసతులు కల్పించడంతో పాటు మంచి వేతనాలతో ఉత్తమ ఫ్యాకల్టీని నియమించుకుంటున్నాయని తెలిపారు. తమ కాలేజీలపై ఫీజుల నియంత్రణ ఉండటంతో మెరుగైన వసతుల కల్పనకు, మంచి ఫ్యాకల్టీని నియమించుకునేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వ యూనివర్సిటీలలో కూడా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో ప్రైవేట్ సమానంగా ఫీజులు ఉన్నాయని, అందువల్లనే ప్రభుత్వ వర్సిటీలు మెరుగైన వసతులు కల్పించగలుగుతునాయని ప్రైవేట్ యాజమాన్యాలు చెప్పినట్లు తెలిసింది. ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రభుత్వ యూనివర్సిటీలో సెల్ఫ్‌ఫైనాన్స్ బ్రాంచీల ఫీజులను దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులను ఖరారు చేయాలని కమిటీని కోరినట్లు తెలిసింది.

బుధవారం । 30 । జూలై । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# చాలా ఖర్చు పెట్టాం... కొంచెమైనా పెంచండి

- ఫీజులు పెంచకుంటే కాలేజీల్లో నాణ్యత డొల్ల
- ప్రతీ ఏటా ద్రవ్యోల్బణం పెరుగుతోంది
- ఇంజనీరింగ్ ఫీజుల కమిటీ వద్ద ప్రైవేటు కాలేజీలు
- ఫీజులు ఎందుకు పెంచాలని ప్రశ్నించిన కమిటీ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: కాలేజీలు బతికి బట్టకట్టాలంటే కనీస మాత్రమైనా ఫీజులు పెంచాలని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు కోరాయి. చాలా ఖర్చు పెట్టామని, పెంచకపోతే కాలేజీల్లో నాణ్యత ప్రమాణాలు పడిపోతాయని చెప్పాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఫీజుల పెంపుపై పరిశీలనకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ మంగళవారం భేటీ అయింది. జేఎన్‌టీయూ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశానికి కమిటీ సభ్యులు దేవసేన, ఎం.వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్య, తమిళనాడు ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ విజయకుమార్ హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. ఫీజుల పెంపుపై ఆరు వారాల్లో స్పష్టత ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఫీజులు, కాలేజీల్లో నాణ్యతపై కమిటీ సభ్యులు చర్చించారు. అనంతరం కాలేజీ యాజమాన్యాల వాదనలు విన్నారు.

**ఫీజులెందుకు పెంచాలి?**

అసలు ఫీజులు ఎందుకు పెంచాలో చెప్పండంటూ కమిటీ సభ్యులు ప్రైవేటు కాలేజీలను ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో ఫీజులు తక్కువగా ఉన్నాయన్నారు. తమిళనాడులో అన్ని కాలేజీలకూ ఒకే ఫీజు వర్తిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మన రాష్ట్రంలో ప్రతీ మూడేళ్లకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. కొన్ని కాలేజీలు నిబంధనల ప్రకారం అర్హులను రికార్డుల్లో చూపిస్తున్నాయని, అర్హత లేని వారితో బోధన చేయిస్తున్నాయని, వేతనాలు కూడా వారి ఖాతాల్లో వేసి తిరిగి యాజమాన్యాలు తీసుకుంటున్నాయనే ఫిర్యాదులను ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ప్రస్తావించినట్టు తెలిసింది. కంప్యూటర్ కోర్సులకు తగ్గ మౌలిక వసతులు లేవన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయని కమిటీ సభ్యులు చెప్పారు.

**పెంచకుంటే ఫ్యాకల్టీ ఉండదు..**

సీబీఐటీ, వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి, స్టాన్లీ, వీబీఐటీ, వాసవీ, నారాయణమ్మ, ఏస్, వాగ్దేవి సహా పది ఇంజనీరింగ్ కాలేజీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. మౌలిక వసతుల కల్పనలో ప్రతీ ఏటా ఖర్చు చేస్తున్నామని వారు తెలిపారు. ఉద్యోగులకు వేతనాలు ప్రతీ ఏటా పెంచుతున్నామని, ఫీజుల పెంపు లేకుంటే, పీహెచ్‌డీ ఉన్న ఫ్యాకల్టీ వేరే రాష్ట్రాలకు వెళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. అన్ని కాలేజీలను ఒకే గాటన కట్టొద్దని కోరారు. ఏటా పెరిగే ద్రవ్యోల్బణాన్ని ఫీజుల పెంపునకు ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. తమిళనాడులో కొన్ని దశాబ్దాల క్రితం కాలేజీలు పెట్టారని, వాళ్లంతా బడా పారిశ్రామిక వేత్తలని తెలిపారు.

### పేరుకే చైర్మన్... పెత్తనం వాళ్లదేనా?

ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఉన్నప్పటికీ విద్యాశాఖ, సాంకేతిక విద్య అధికారులే సమావేశంలో కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఫీజులపై విధివిధానాలు, ఏ కోణంలో వెళ్లాలో ముందే సన్నద్ధమై వెళ్లిన బాలకిష్టారెడ్డికి ఆ అవకాశం కూడా చిక్కలేదని తెలిసింది. కమిటీ చైర్మన్‌గా తానెందుకు అన్న భావన సన్నిహితుల వద్ద వ్యక్తం చేసి, వాపోయినట్టు తెలిసింది. ఇదే విధమైన పెత్తనం చెలాయిస్తే తాము కూడా సభ్యులుగా ఉండలేమని కమిటీలోని ఇతర సభ్యులుగా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.

# 91.2 శాతం ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు

## షెడ్యూల్ కన్నా ముందే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ రెండో విడత సీట్లను మంగళవారం కేటాయించారు. ఇప్పటివరకు 83,521 (91.2 శాతం) సీట్లు కేటాయించినట్టు సాంకేతిక విద్యావిభాగం వెల్లడించింది. ఇంకా 7,974 సీట్లు మిగిలిపోయినట్టు తెలిపింది. ఈనెల 30వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపిన అధికారులు, ముందే వెల్లడించడం విశేషం. కౌన్సెలింగ్‌లో 178 కాలేజీలు పాల్గొన్నాయి. తాజాగా పెరిగిన సీట్లతో కలుపుకొని 91,495 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి, రెండో విడతకు కలిపి 96,974 మంది 36,74,976 ఆప్షన్లు ఇచ్చారు. 21,402 మందికి వివిధ కాలేజీల్లో సీట్లు మారాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో కొత్తగా 23,509 సీట్లు కేటాయించారు. 6,377 మందికి ఆప్షన్లు ఇచ్చినా, అవి సరిగా లేని కారణంగా సీట్లు కేటాయించలేదు. 6,445 సీట్లను ఈడబ్ల్యూఎస్ కోటా కింద కేటాయించారు. ఐదు యూనివర్సిటీలు, 72 ప్రైవేటు కాలేజీల్లో వంద శాతం సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు వచ్చే నెల 2వ తేదీలోగా రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

**కంప్యూటర్ సీట్లల్లో 95 శాతం భర్తీ**

కంప్యూటర్ సైన్స్, ఇతర అనుబంధ ఎమర్జింగ్ కోర్సుల్లో 64,813 సీట్లు అందుబాటులో ఉంటే, రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత 61,845 (95.42 శాతం ) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 2,968 సీట్లు మిగిలిపోయాయి. సీఎస్ఈలో 30,655 సీట్లకు 29,488 సీట్లు, ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లో 12,215 సీట్లకు 10,905 భర్తీ అయ్యాయి. ఇంకా 1,310 సీట్లు మిగిలిపోయాయి ఈఈఈ బ్రాంచ్‌లో 73.10 శాతం భర్తీ అయితే, సివిల్ ఇంజనీరింగ్‌లో 76.08, మెకానికల్‌లో 68.49 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

బుధవారం | హైదరాబాద్
30.07.2025
www.v6velugu.com
ప్రభాత వెలుగు

# బీటెక్‌లో 82,521 మందికి సీట్లు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో బీటెక్ ఫస్టియర్ కాలేజీల్లో టీజీ ఎప్ సెట్ సెకండ్ ఫేజ్ సీట్ల అలాట్ మెంట్ ప్రక్రియ పూర్తయింది. మొత్తం సీట్లలో 91.2 శాతం నిండాయి. ఈ మేరకు మంగళవారం టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన ఎప్ సెట్ సీట్ల అలాట్మెంట్ డేటాను రిలీజ్ చేశారు. ఎప్ సెట్ సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ కు రాష్ట్రవ్యాప్తంగా 178 ఇంజినీరింగ్ కాలేజీలు అందుబాటులో ఉండగా.. వాటిలో 91,495 కన్వీనర్ కోటా సీట్లున్నాయి. అయితే, రెండు విడతల్లో 96,974 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు అటెండ్ అయ్యారు. వారిలో సెకండ్ ఫేజ్‌కు ప్రత్యేకంగా 68,630 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 23,509 మందికి కొత్తగా సీట్లు అలాట్ కాగా.. మరో 21,402 మందికి సీట్లు మారాయి. రెండు విడతల్లో కలిపి మొత్తం 83,521 సీట్లు నిండాయి. కేవలం 7,974 సీట్లు మాత్రమే మిగిలాయి. సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 1లోగా సెల్ఫ్ రిపోర్టు చేయాలని సూచించారు. కాగా, తక్కువ ఆప్షన్లు ఇచ్చిన 6,377 మందికి సీట్లు అలాట్ కాలేదు. 77 కాలేజీల్లో వందశాతం సీట్లు నిండాయి. కాగా, 20 సర్కారు వర్సిటీ కాలేజీల్లో 6,198 సీట్లుంటే 4,942 సీట్లు, ఒక గవర్నమెంట్ కాలేజీలో 198 సీట్లుంటే 41 సీట్లు నిండాయి. 155 ప్రైవేటు కాలేజీల్లో 82,713 సీట్లకు 77,158 సీట్లు, రెండు ప్రైవేటు వర్సిటీల్లో 1,380 సీట్లు అలాట్ అయ్యాయి.

- ఎప్ సెట్ సెకండ్ ఫేజ్‌లో 91.2% సీట్ల అలాట్
- 77 కాలేజీల్లో 100% సీట్ల భర్తీ
- కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లకే ఫుల్ డిమాండ్
- 64,813 సీట్లకు 61,845 సీట్లు నిండినయ్

**కంప్యూటర్ సైన్స్ లోనే 61 వేల సీట్లు నిండినయ్**

ఇంజినీరింగ్ లో కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ బ్రాంచ్‌ల సీట్లకే ఫుల్ డిమాండ్ నెలకొన్నది. మొత్తం 18 బ్రాంచుల్లో 64,813 సీట్లుంటే 61,845 సీట్లు అలాట్ అయ్యాయి. మరో 2,968 సీట్లు మిగిలాయి. ఆరు బ్రాంచుల్లో వందశాతం సీట్లు నిండాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్ దాని అనుబంధ కోర్సుల్లో 17,823 సీట్లు 15,142 (84.96%) సీట్లు అలాట్ అయ్యాయి. సివిల్, మెకానికల్ దాని అనుబంధ కోర్సుల్లో 7,719 సీట్లకు గానూ 5,702 సీట్లు, ఇతర కోర్సుల్లో 1,140 సీట్లుంటే 832 సీట్లు స్టూడెంట్లకు కేటాయించారు.

**ప్రధాన బ్రాంచుల్లో సీట్ల వివరాలు..**

| కోర్సు | సీట్లు | భర్తీ | ఖాళీ |
|---|---|---|---|
| సీఎస్ఈ | 30655 | 29488 | 1167 |
| సీఎస్ఈ (ఏఐఎంఎల్) | 15189 | 14,648 | 541 |
| ఈసీఈ | 12215 | 10,905 | 1310 |
| సీఎస్ఈ (డేటాసైన్స్) | 8318 | 7626 | 492 |
| ఈఈఈ | 5037 | 3682 | 1355 |
| ఐటీ | 4143 | 3877 | 266 |
| సివిల్ ఇంజినీరింగ్ | 3741 | 2846 | 895 |
| మెకానికల్ | 3478 | 2382 | 1096 |

# సర్కార్ డిగ్రీ కాలేజీల్లో నో స్పాట్ అడ్మిషన్స్

- ఈసారి కూడా ప్రైవేటు, ఎయిడెడ్ కాలేజీలకే చాన్స్

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లకు ఈ ఏడాది కూడా అవకాశం కల్పించలేదు. కేవలం 630 ప్రైవేటు, 29 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలకు మాత్రమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అనుమతించింది. 119 ప్రభుత్వ, 37 అటానమస్, వర్సిటీ కాలేజీలకు స్పాట్ అడ్మిషన్ అవకాశం నిరాకరించింది. దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు ఈ నెల 25 నుంచి ఆగస్టు 6 వరకు కొనసాగనున్నాయి. ఇది పూర్తయిన తర్వాత ఆగస్టు 11, 12 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నారు. గతంలో దోస్త్ అడ్మిషన్లలో నాన్‌లోకల్ కోటా ఉండేది. ఈ ఏడాది అడ్మిషన్లు పూర్తిగా తెలంగాణ విద్యార్థులకే పరిమితమయ్యాయి.

# రెండో విడతలో 23,509 మందికి బీటెక్ సీట్లు

- తొలిదశలో సీట్లు పొందిన 21,402 మంది కళాశాలలు మారారు
- మొత్తంగా 91.2% సీట్లు భర్తీ
- కోస్గి కళాశాలలో నిండిన సీట్లు 21%
- 2వ తేదీ లోపు స్వయంగా రిపోర్ట్ చేస్తేనే సీటు నిలిచేది

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్‌లో కొత్తగా 23,509 మంది విద్యార్థులు బీటెక్ సీట్లు పొందారు. సీట్లు పెరగడం, విద్యార్థులు ఎక్కువ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడంతో నూతనంగా సీట్లు పొందిన వారు అధిక సంఖ్యలో ఉన్నారు. రెండో విడత సీట్లను ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ మంగళవారం కేటాయించింది. కన్వీనర్ కోటా కింద 178 కళాశాలల్లో 91,495 సీట్లు ఉండగా 83,521 మందికి సీట్లు దక్కాయి. అంటే 91.2% భర్తీ కాగా 7,974 సీట్లు మిగిలిపోయాయి. అయితే, వెబ్ ఆప్షన్లు ఇచ్చినా 6,377 మందికి సీట్లు దక్కలేదు. మొత్తం 77 కళాశాలల్లో 100% సీట్లు నిండాయి. గత ఏడాది ఏర్పాటు చేసిన కోస్గి ప్రభుత్వ కళాశాలలో 198 సీట్లుండగా 41 సీట్లే (20.70%) భర్తీ కావడం గమనార్హం. ఇక్కడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను నిరుడు ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు.

## బ్రాంచీలు, కళాశాలలు మారిన వారు 36%

ఎప్‌సెట్ తొలి విడత కన్వీనర్ కోటాలో 83,054 బీటెక్ సీట్లు అందుబాటులో ఉండగా... 77,561 మందికి సీట్లు దక్కాయి. వారిలో 59,980 మంది మాత్రమే ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. తొలి విడతలో రిపోర్ట్ చేసిన వారిలో 21,402 మంది అంటే దాదాపు 36% మంది ఇంజినీరింగ్ బ్రాంచీలు లేదంటే కళాశాలలు మారారు. మెరుగైన కళాశాలల్లో ప్రవేశానికి విద్యార్థులు ప్రయత్నించారని స్పష్టమవుతోంది.

## విద్యార్థులు ఏం చేయాలంటే...

రెండో విడతలో సీట్లు పొందిన వారు వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 1వ తేదీ లోపు ఫీజు చెల్లించి, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్ట్ చేయాలి. అంతేకాదు... 2వ తేదీలోపు కళాశాలల్లో స్వయంగా రిపోర్ట్ చేయాలి. అంటే అసలు టీసీతోపాటు ఇతర విద్యార్హతలకు సంబంధించి జిరాక్స్ పత్రాలను కళాశాలల్లో అందజేయాలి. సీట్లు రద్దు చేసుకోవడానికి ఆగస్టు 2వ తేదీ వరకు గడువు ఉంది.

**ప్రధాన బ్రాంచీల్లో ఇదీ సీట్ల కేటాయింపు పరిస్థితి**

| కోర్సు | మొత్తం సీట్లు | కేటాయింపు |
|---|---|---|
| సీఎస్ఈ | 30,655 | 29,488 |
| ఐటీ | 4,143 | 3,877 |
| సీఎస్ఈ(ఏఐ-ఎంఎల్) | 15,189 | 14,648 |
| సీఎస్ఈ(డేటా సైన్స్) | 8,318 | 7,826 |
| సీఎస్ఈ(సైబర్ టెక్నాలజీ) | 1,861 | 1,825 |
| ఏఐ అండ్ డేటా సైన్స్ | 1,236 | 1,148 |
| ఈసీఈ | 12,215 | 10,905 |
| ఈఈఈ | 5,037 | 3,682 |
| సివిల్ | 3,741 | 2,846 |
| మెకానికల్ | 3,478 | 2,382 |

# ఫీజుల విధి విధానాల రూపకల్పనకు సబ్ కమిటీలు

- ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల పోటీని తట్టుకోవడం కష్టమవుతోంది
- కమిటీ సమక్షంలో ఇంజినీరింగ్ కళాశాలల ప్రతినిధుల ఆవేదన

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, కూకట్‌పల్లి: ప్రైవేటు ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలల ఫీజులను ఖరారు చేసేందుకు కొలమానాల రూపకల్పన కోసం లోతుగా పరిశీలించేందుకు సబ్ కమిటీల(ఉప సంఘాలు)ను నియమించాలని ఫీజుల కమిటీ నిర్ణయించినట్లు సమాచారం. కమిటీ తొలి సమావేశం జేఎన్‌టీయూహెచ్‌లో మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, ఫీజుల కమిటీ ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, కమిటీ సభ్యురాలైన రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ హాజరయ్యారు. కేశవరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రమాణాలను పాటించాలని కోరారు. కొన్ని [illegible]బ్బందికి వేతనాలు ఇచ్చినట్లే ఇచ్చి.. కొంత వెనక్కి తీసుకుంటున్నాయని వ్యాఖ్యానించినట్లు సమాచారం. కమిటీ ఏర్పాటుకు కారణాలను సభ్యులు వివరించి.. 10 కళాశాలల నుంచి హాజరైన ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరించారు. తమిళనాడు ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ తమ రాష్ట్రంలో 65 శాతం కన్వీనర్, 35 శాతం బి కేటగిరీ కింద భర్తీ చేస్తున్నామన్నారు. తమిళనాడు నుంచి ఉపాధ్యక్షుడితో పాటు కళాశాలల ప్రతినిధులను కమిటీ ఛైర్మన్‌తో సంబంధం లేకుండా.. కమిటీ సభ్యురాలు, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆహ్వానించడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై బాలకిష్టారెడ్డి, శ్రీదేవసేనలను వివరణ కోరేందుకు 'ఈనాడు' ప్రయత్నించగా వారు స్పందించలేదు. సమావేశంలో వర్సిటీ ఉపకులపతులు టి. కిషన్‌కుమార్‌రెడ్డి(జేఎన్‌టీయూహెచ్), ప్రతాప్‌రెడ్డి(కాకతీయ), చక్రపాణి(అంబేడ్కర్), జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ఆచార్య కె. వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## కళాశాలల ప్రతినిధుల అభిప్రాయాలు

- 'ప్రపంచస్థాయి విద్యను అందించాలంటారు.. ఫీజులు పెంచేది లేదంటారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వరు.. మళ్లీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదంటారు' అని ప్రతినిధులు పేర్కొన్నారు.
- ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలు వేల సంఖ్యలో సీట్లు పెంచుకుంటున్నాయని, ఫీజులు ఎంతో వారే నిర్ణయించుకుంటున్నారని, దాంతో వేతనాలు ఎక్కువ ఇస్తామని చెబుతుండటంతో తమ కళాశాలల్లో అధ్యాపకులను నిలుపుకోవడమే కష్టమవుతుందన్నారు.
- భారీగా ఫీజు పెరిగిందని అంటున్నారు.. వాస్తవానికి 2022లో తమకు ఒక్క పైసా కూడా పెరగలేదని, అందుకు కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని, దాంతో ఇప్పుడు ఎక్కువ పెరిగినట్లు కనిపిస్తోందని ఒక కళాశాల ప్రతినిధి వివరణ ఇచ్చినట్లు సమాచారం.
- ఫీజుల నిర్ధరణలో ఎన్‌బీఏ, న్యాక్ గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లను పరిగణనలోకి తీసుకోవాలని పలువురు సూచించారు.
- విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్(సీఆర్‌టీ)కు ఖర్చు చేస్తుంటే ఆ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని వివరించారు.
- కొందరు ఎల్‌కేజీ ఫీజులతో పోలుస్తూ.. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపు ఆవశ్యకతను కమిటీ దృష్టికి తెచ్చారు.